
సాక్షి నిర్మల్

ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



మహిమాన్వితం... సాయి పుణ్యక్షేత్రం

కల్లూరు సాయిబాబా ఆలయం రెండో షిర్డీగా విరాజిల్లుతోంది. ఆదివారం నుంచి దత్త జయంతి నిర్వహిస్తున్నారు. 8లో▸



అప్రమత్తతే శ్రీరామరక్ష

సస్యరక్షణలో భాగంగా పంటలపై పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ పేర్కొన్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.4 /17.3

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. ఉష్ణోగ్రతలు సాధారణం కాన్నా తగ్గుతాయి. రాత్రి మంచు కురుస్తుంది. చలి ప్రభావం పెరుగుతుంది.

యాసంగి.. సాగేనా?

- ఇప్పటికే నార్లు పోస్తున్న రైతులు
- పడిపోయిన 'కడెం' నీటిమట్టం
- ఆయకట్టుకు నీరందడం కష్టమే..
- ఎస్సారెస్పీ, స్వర్ణ ఆయకట్టుకు ఢోకా లేదు



మహిళా కూలీలతో నాట్లు వేయిస్తున్న రైతు(ఫైల్)

భైంసా: యాసంగి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. వానాకాలం వరికోతలు పూర్తి కావడంతో యాసంగి నార్లు పోసుకుంటున్నారు. జిల్లాలో ఎస్సారెస్పీ, కడెం, గడ్డెన్న, స్వర్ణ ప్రాజెక్టుల కింద సుమారు లక్ష ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. ఈఏడాది వర్షాలు జూలై, ఆగస్టులోనే సమృద్ధిగా కురిశాయి. తర్వాత వరణుడు ముఖం చాటేశాడు. దీంతో ప్రాజెక్టుల్లో నీటిమట్టాలు గతేడాదితో పోలిస్తే ఈసారి తక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాజెక్టుల కింద పంటలు సాగు చేసే రైతుల్లో కాస్త ఆందోళన వ్యక్తమవుతోంది. చివరి వరకు నీరందుతుందా లేదా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

'సిరాల' కింద సాగుకు సెలవు..

ఈ ఏడాది వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు సిరాల ప్రాజెక్టు కొట్టుకుపోయింది. సిరాల, ఇలేగాం, మచ్కల్, దేగాం రైతుల పంట పొలాలకు రెండు సీజన్లలో ఈ నీరు అందేది. ప్రాజెక్టు తెగిపోవడంతో వర్షాకాలంలోనూ రైతులు పంటలు వేయలేదు. మరమ్మతులు చేయకపోవడంతో యాసంగిలోనూ నీరు అందే పరిస్థితి లేదు. కొట్టుకుపోయిన ప్రధాన కట్ట నిర్మించి కాలువలు మరమ్మత్తులు చేస్తేనే రైతులకు నీరందే అవకాశం ఉంది. ప్రాజెక్టు తెగిన వెంటనే అధికారులు ప్రభుత్వానికి పరిస్థితిని వివరించారు. ఇటీవలే ఈఎన్సీ నాగేందర్ ఈ ప్రాజెక్టును పరిశీలించారు.

'కడెం' ఇలా..

కడెం ప్రాజెక్టు ఆయకట్టుకు నీరివ్వడం కష్టమే అని అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 4 టీఎంసీల నీరు ఉంది. గతేడాది ఈ సమయానికి 6.420 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టు కింద 68 వేల ఎ కరాలకు నీరు అందేది. ఈ వేసవిలో 20 వేల ఎకరా లకు కూడా నీరిచ్చేపరిస్థితిలేదు. దీంతో ప్రాజెక్టు కింద బోరుబావులు ఉన్న రైతులు వరి సాగుచేసేందుకు సిద్ధమవుతున్నారు. నీరు అందని భూముల్లో పంటసాగు కష్టమేనని రైతులు చెబుతున్నారు. గతేడాది యాసంగిలో పంటలు వేశామని, ఈయేడు సాగుకు సెలవు ఇవ్వక తప్పడంలేదని ఆయకట్టు చివరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్వర్ణ కింద సాగు...

స్వర్ణ ప్రాజెక్టు ఆయకట్టు రైతులు కూడా యాసంగి సాగుకు సిద్ధమవుతున్నారు. స్వర్ణ ప్రాజెక్టులో ఉన్న నీటితో పంటలు సాగుచేయవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు పూ ర్తిస్థాయి నీటి మట్టం 1,183 అడుగులు కాగా, నీటి సామర్థ్యం 1.484 టీఎంసీలు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1,179 అడుగుల నీటి మట్టం ఉంది. యాసంగిలో 10 వేల ఎకరాలకు నీరు అందుతుందని అధికారులు చెబుతున్నారు. కానీ, ఇప్పటికే రైతులు వరినా ర్లు పోసుకున్న రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు.

'గడ్డెన్న' అయకట్టుకు నీరు..

గడ్డెన్నవాగు ప్రాజెక్టు కింద 8 వేల ఎకరాలకు నీరు అందిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్టులో నీరు చేరింది. భైంసా, లోకేశ్వరం మండలాల్లోని పంటలకు నీరు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు రైతులు కూడా నార్లు పోసుకుని వరి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఎస్సారెస్పీ కింద...

ఉత్తర తెలంగాణ వరప్రదాయని అయిన ఎస్సారెస్పీ కింద సరస్వతి కెనాల్‌తో జిల్లాలో 32 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. నిర్మల్ నియోజకవర్గంలో 21 వేల ఎకరాలకు నీరు ఇస్తున్నారు. యాసంగిలో నిర్మల్ నియోజకవర్గ రైతులకు యథావిధిగా నీరు అందనుంది. ఇప్పటికే యాసంగిలో పంటసాగుపై ఎస్సారెస్పీ అధికారులు సమావేశం నిర్వహించారు. త్వరలోనే నీటి పరిస్థితిపై అధికారులు నిర్ణయం వెలువరించనున్నారు. ఎస్సారెస్పీలో ప్రస్తుతం 78.342 టీఎంసీల నీరు నిల్వ ఉంది. యాసంగిలో జిల్లా రైతులకు సరస్వతీ కెనాల్ ద్వారా నీరందించనున్నారు.

నార్లు పోస్తున్నం



వానాకాలం కోతలు పూర్తయినయ్. యాసంగి సాగుకు వరినా ర్లు పోస్తున్నం. నాకు స్వర్ణ ప్రాజెక్టు కింద భూమి ఉంది. ఇప్పటికే నారు పోసిన. యాసంగి పంటలకు నీరిస్తమని అధికారులు చెబుతున్నరు. పంట పూర్తయ్యే వరకూ నీరివ్వాలి.

– రమేశ్, రైతు కౌట్ల(బి) సారంగాపూర్ మండలం

నీరందడం కష్టమే..



కడెం ప్రాజెక్టు కింద ఈయేడు నీరందడం కష్టమే. ఇప్పటికే ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గింది. ప్రాజెక్టు కింద నీరు రాదని అధికారులు చెబుతున్నరు. బోరుబావులు ఉన్న కొంత మంది రైతులు నార్లు పోసుకుంటున్నరు. ప్రాజెక్టు కింద చాలా మంది పంట వేయడం లేదు.

– కొయ్యాడి రాజేశ్, రైతు రాంపూర్ దస్తురాబాద్

ఏర్పాట్లు చేస్తున్నాం..

జిల్లాలోని ప్రాజెక్టుల కింద రైతులకు నీరందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టుల కింద నీరు అందుతుంది. గడ్డెన్నవాగు ప్రాజెక్టు కింద 8 వేల ఎకరాలకు నీరిస్తాం. ఎస్సారెస్పీ ఆయకట్టుకు కూడా ఢోకా లేదు. సిరాల ప్రాజెక్టు కొట్టుకుపోయింది. భారీ వర్షాలతో ఈ పరిస్థితి ఏర్పడడంతో ఇటీవలే ఈఎన్సీ నాగేందర్ పరిస్థితిని పరిశీలించారు. కడెంలో నీటిమట్టం తగ్గిపోయింది. యాసంగికి నీరివ్వడం కష్టమే.

– రామారావు, ఇరిగేషన్ ఈఈ

న్యూస్‌రీల్

మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్లకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హాజరై మాట్లాడారు. నూతన ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, బూత్‌లెవెల్ అధికారుల విధులు తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఏఎల్ఎంటీఎస్‌కు శిక్షణ ఓటర్ జాబితా తయారీలో బూత్ స్థాయి అధికారి పాత్ర, విధుల బాధ్యతల గురించి శిక్షణ నిర్వహించినట్లు వివరించారు. భారత ఎన్నికల సంఘం, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ట్రైనింగ్ అధికారి ముధోల్ తహసీల్దార్ అతీకొద్దీన్, ఈడీఎం నదీమ్, మాస్టర్ ట్రైనర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ ప్రవీణ్ కుమార్

నిర్మల్‌టౌన్: పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. అనారోగ్యంతో ఇటీవల మరణించిన హెడ్‌కానిస్టేబుల్ డి.శంకర్ కుటుంబానికి పోలీస్ భద్రత పథకం నుంచి మంజూరైన చెక్కును ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో శంకర్ కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. కుభీర్ పోలీస్‌స్టేషన్ అటాచ్ బాసర ట్రిపుల్‌ఐటీలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న డి.శంకర్ జూలై 17న అనారోగ్యంతో మరణించాడు. దీంతో తెలంగాణ పోలీస్ భద్రత పథకం ద్వారా బాధితకుటుంబానికి రూ.7.20 లక్షలు మంజూరయ్యాయి. ఆ చెక్కును శంకర్ భార్య అనితకు అందించారు. కార్యక్రమంలో భద్రత సెక్షన్ ప్రసాద్, పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధి విరాసత్ అలీ పాల్గొన్నారు.

కుభీర్ పోలీసు స్టేషన్‌ను తనిఖీచేసిన ఏఎస్పీ



ఫైళ్లను పరిశీలిస్తున్న కాంతిలాల్ పాటిల్

కుభీర్: కుభీర్ పోలీస్ స్టేషన్‌ను భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నేరాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఠాణా ఆవరణలో మొక్క నాటారు. ఏఎస్పీ వెంట భైంసారూరల్ సీఐ నైలు, ఎస్సై ఎండీ.షరీఫ్ ఉన్నారు.

పాఠశాలలను సందర్శించిన ఆర్జేడీ



రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్జేడీ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల, మండల పరిషత్ పాఠశాలను వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి శనివారం సందర్శించారు. పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశాలు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, తొలిమెట్టు అమలు, వర్క్‌బు క్‌ను పరిశీలించి విద్యార్థుల ప్రగతిని స్వయంగా తెలుసుకున్నారు. ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే తల్లిదండ్రుల సమావేశాలకు ఎక్కువ మొత్తంలో, తప్పకుండా హాజరయ్యేలా చూడాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. వారివెంట ఎంఈవో శంకర్, సెక్టోరియల్ అధికారులు ప్రవీణ్‌కుమార్, నర్సయ్య ఉన్నారు.

శరణం.. శబరి గిరీశా..



ముధోల్ మండల కేంద్రంలోని పశుపతినాథ్ శివాలయంలో ముధోల్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహా పడిపూజ కనుల పండువగా నిర్వహించారు. రాజుగురుస్వామి ఆధ్వర్యంలో పడి పూజ నిర్వహించారు. 9లో▸

పెన్షనర్ల ఆశాజ్యోతి ధర్మస్వరూప్ నకారా

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



పెన్షనర్లను సన్మానిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: పెన్షనర్ల ఆశాజ్యోతి ధర్మ స్వరూప్ నకారా అని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. జాతీయ పెన్షనర్స్ డే పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు ఎంసీ. లింగన్న ఆధ్వర్యంలో స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో శనివారం పెన్షనర్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్‌హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. విశ్రాంత ఉద్యోగులకు పెన్షనర్స్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఏటా డిసెంబర్ 17న జాతీయ పెన్షనర్స్ డే నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో ఒకరోజు ముందే వేడుకలు నిర్వహించుకున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ సౌకర్యం కోసం 1982, డిసెంబరు 17న జస్టిస్ చంద్రచూడ్ ఇచ్చిన తీర్పుతో పెన్షనర్లకు భద్రత కలిగిందన్నారు. ఆ తీర్పు కోసం శ్రమించిన దివంగత డీఎస్ నకారా జ్ఞాపకార్థం పెన్షనర్స్ డే జరుపుకుంటున్నామని వివరించారు. అనంతరం పలువురు పెన్షనర్లను సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చందూలాల్ శ్రీవాత్సవ, డీటీవో ప్రభాకర్, ఆర్డీవో రత్నకళ్యాణి, డీపీఆర్వో తిరుమల, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

19న జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ పోటీలు

నిర్మల్‌రూరల్: తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న జిల్లాస్థాయి అథ్లెటిక్స్, క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మనాభగౌడ్, శామ్యూల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళలు, పురుషులకు 10 కిలోమీటర్లు, 20 ఏళ్లలోపు బాలురకు 8 కిలోమీటర్లు, బాలికలకు 6 కిలోమీ టర్లు, 16 ఏళ్లలోపు బాలబాలికలకు 2 కిలోమీటర్ల పరుగు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందులో పాల్గొనేవారు వయసు ధృవీకరణ పత్రాలు, తహసీల్దార్, సర్పంచ్, మున్సిపాలిటీ నుంచి తీ సుకురావాలని వివరించారు. వివరాలకు 94405 16634 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డయాలసిస్ సేవలు ఎప్పుడో!



ట్రక్కు నుంచి దయాలిసిస్ యంత్ర పరికరాలు దించుతున్న సిబ్బంది(ఫైల్)

- భైంసా ఏరియాస్పత్రికి ఐదు పడకలు మంజూరు
- సేవల కోసం కిడ్నీ బాధితుల ఎదురుచూపు

భైంసాటౌన్: కిడ్నీ సంబంధ వ్యాధులతో బాధపడుతున్న వారికోసం భైంసాలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో డయాలసిస్ సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు ఐదు పడకలు గతంలోనే మంజూరయ్యాయి. ముంబయి నుంచి ప్రత్యేక వాహనంలో డయాలసిస్ పరికరాలు సైతం ఆస్పత్రికి చేరుకున్నాయి. రోగులకు స్థానికంగానే సేవలు అందించేందుకు ఆస్పత్రి సిబ్బందికి సైతం డయాలసిస్ సేవలపై శిక్షణ అందించారు. యంత్ర పరికరాలకు అవసరమైన గ్రౌండ్‌వాటర్, మినరల్ వాటర్ నీటి నాణ్యత పరీక్ష కోసం శాంపిళ్లు సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు.

ప్రారంభం కాని సేవలు..

భైంసా డివిజన్ పరిధిలోని డయాలసిస్ రోగుల వెతలు వర్ణనాతీతం. వారం, లేదా 15 రోజులకు ఒకసారి వ్యాధి తీవ్రతను బట్టి డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఇందుకుగాను ఆస్పత్రులకు వెళ్లాల్సి ఉంటుంది. రోగితోపాటు ఒకరు సహాయకులు వెళ్లాలి. భైంసా పట్టణంతోపాటు డివిజన్ పరిధిలోని కిడ్నీ రోగులు డయాలసిస్ కోసం ప్రస్తుతం నిర్మల్, నిజామాబాద్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. రోగితోపాటు వారికి సహాయకులు వెళ్లేందుకు దూరభారంతోపాటు ఆర్థికంగానూ భారమే. ఈ నేపథ్యంలో భైంసాలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో డయాలసిస్ సేవల త్వరగా అందుబాటులోకి తీసుకువస్తే డయాలసిస్ బాధితులకు దూరభారంతోపాటు ఆర్థికంగా భారం తప్పనుంది.

త్వరలో అందుబాటులోకి...

భైంసాలోని ప్రభుత్వ ఏరియాస్పత్రికి ఐదు పడకలతో డయాలసిస్ కేంద్రం మంజూరైంది. నెలరోజుల క్రితం పరికరాలు సైతం వచ్చాయి. పరికరాల బిగింపు పూర్తయింది. డయాలసిస్ రోగులకు సేవలందించేందుకు ఆస్పత్రి సిబ్బందికి నిర్మల్‌లో శిక్షణ కూడా ఇప్పించాం. గ్రౌండ్, మినరల్ వాటర్ నాణ్యత పరీక్ష కోసం శాంపిల్‌ను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించాం. రిపోర్టులు రాగానే సేవలు ప్రారంభిస్తాం.

– డాక్టర్ కాశీనాథ్, సూపరింటెండెంట్, భైంసా

'నామినేటెడ్'పై ఆశలు

- పదేళ్లుగా పోస్టులకు దూరం
- పదవుల భర్తీపై హస్తం పార్టీ దృష్టి
- వివిధ సంస్థల చైర్మన్ల కోసం ప్రయత్నం



నిర్మల్: పదేళ్లుగా అధికారానికి, పదవులకు దూరంగా ఉన్న కాంగ్రెస్ నాయకులకు ఇప్పుడు అవకాశం వచ్చింది. జిల్లాలో అనుకున్న ఫలితాలు రాకున్నా.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో నాయకుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. సీనియర్ నేతలకు ఎమ్మెల్సీ, పలు కార్పొరేషన్ల పదవులు మొదలుకుని, జిల్లాస్థాయి నేతలకు స్థానికంగా పలు సంస్థల చైర్మన్ పోస్టులు దక్కుతాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తమలో ఎవరికి ప్రాధాన్యత ఇస్తుందోనన్న చర్చ కూడా హస్తం నేతల మధ్య సాగుతోంది.

పదేళ్లుగా దూరం..

ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. అప్పుడు తెలంగాణ ఉద్యమం జోరుగా ఉండటంతో ఎమ్మెల్యేలు, వివిధ సంస్థల చైర్మన్ పదవుల్లో ఉన్నవారూ చాలావరకు రాజీనామాలు చేశారు. తమ పదవులను సద్వినియోగం చేసుకోలేకపోయామన్న ఆవేదన కూడా చాలామందిలో ఉంది. ఆ తర్వాత రాష్ట్రం ఏర్పడటం వరుసగా 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపొందడంతో కాంగ్రెస్ నేతలకు అధికారిక పదవులు దూరమయ్యాయి. పదేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది కాంగ్రెస్ అధికారాన్ని చేజిక్కించుకుంది. జిల్లాలోనూ పదేళ్లుగా ఇదే పరిస్థితి ఉంది. దశాబ్దంపాటు మూడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే అధికారంలో ఉన్నారు.

ఇప్పుడు అవకాశం..

జిల్లాలో ఒక్క ఖానాపూర్ మినహా మిగిలిన నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. అయినా రాష్ట్రంలో అధికారంలోకి రావడం పార్టీ శ్రేణులను సంతోషపెట్టింది. పదేళ్ల తర్వాత తమ పార్టీకి అధికారం దక్కడంతో తమకు న్యాయం జరుగుతుందని, వివిధ పదవులకు అవకాశం లభిస్తుందని కాంగ్రెస్ నేతలు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల నుంచి సమన్యాయం చేసేలా పోస్టులు ఇవ్వాలని కోరుతున్నారు.

ఆయా పోస్టులు..

జిల్లాస్థాయిలో తమకు దక్కే అవకాశం ఉన్న పోస్టులను కాంగ్రెస్ నేతలు లెక్కేసుకుంటున్నారు. దాదాపు ఇప్పటికే ఆయా సంస్థలకు చైర్మన్లుగా ఉన్న బీఆర్ఎస్ నేతలు తప్పుకున్నారు. ఎవరు కూడా తమకు కేటాయించిన పదవుల్లో కూర్చోవడం లేదు. జిల్లా గ్రంథాలయసంస్థ, మార్కెట్ కమిటీలు, ఎఫ్ఎస్‌సీఎస్, దేవాలయాల చైర్మన్లు, డైరెక్టర్ల పోస్టులు ఉంటాయి. గత ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు సమన్వయసమితి పోస్టులనూ కొనసాగించవచ్చు.

వారికి అవకాశం..?

కాంగ్రెస్ పార్టీకి సంబంధించి జిల్లా నుంచి సీనియర్లకు రాష్ట్రస్థాయి పోస్టులు కల్పించవచ్చన్న చర్చ నడుస్తోంది. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న కూచాడి శ్రీహరిరావుకు ఎమ్మెల్సీ లేదా ఏదైనా కార్పొరేషన్ చైర్మన్ ఇవ్వొచ్చని సమాచారం. నిర్మల్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సారంగపూర్ జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, యువ నాయకుడు అర్జుమంద్‌అలీలకూ మంచి అవకాశం దక్కవచ్చని పార్టీవర్గాలు చెబుతున్నాయి. జిల్లా నుంచి సీనియర్లుగా ఉన్న నారాయణరావుపటేల్, అల్లూరి మల్లారెడ్డి, ఎంబడి రాజేశ్వర్, ఆనంద్‌రావుపటేల్, దశరథ రాజేశ్వర్, అతిక్ అహ్మద్, వినోద్‌నాయక్, మహిళానేత దుర్గాభవానీలతో మూడు నియోజకవర్గాల నుంచి పలువురు కాంగ్రెస్ నేతలు, సీనియర్లు, జూనియర్లు వివిధ పోస్టుల కోసం ఎదురుచూస్తున్నారు.

పాత పెన్షన్ ప్రకటనపై హర్షం



నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఉద్యోగులు..

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని శనివారం అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని నీటిపారుదల శాఖ కార్యాలయ ఉద్యోగులు పాత పెన్షన్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. 2004 నుంచి ఈ విధానం ద్వారా ఉద్యోగ ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సీపీఎస్ రద్దు కోరుతూ మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అనేక కార్యక్రమాలు చేశామని తమ పోరాటాన్ని గుర్తించిన ప్రభుత్వం సీపీఎస్ రద్దుకు ఒప్పుకోవడం శుభ పరిణామమన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌లోపు సీపీఎస్ రద్దుచేసి పాతపెన్షన్ విధానం అమలు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు కృష్ణారావుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ అనిల్, చక్కరి శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, జవాద్ హుస్సేన్, శ్రీనివాస్, సంతోష్‌సింగ్, శ్రీకాంత్, సురేష్, ప్రభాకర్, తిరుపతి, అశోక్, సుధాకర్, గంగన్న, నరేష్, స్నేహలత, హనుమంతరావు, రాధా, లక్ష్మి, గంగమణి, అనసూయ, వరలక్ష్మి పాల్గొన్నారు.

కుంటాలలో..



కుంటాలలో హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

కుంటాల: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించడంపై కుంటాలలోఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీం ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.కష్ణారావు మాట్లాడుతూ.. 2004 సంవత్సరం నుంచి ఈ విధానం ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయులు నష్టపోయారన్నారు. కార్యక్రమంలో డీఎల్పీవో శివకృష్ణ, ఎంపీవో రహీం, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, నగేశ్, తిరుపతిగౌడ్, ప్రవీణ్‌కుమార్, లక్ష్మణ్, రాణి, సుధాకర్, శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ ఉమ్మడి జిల్లా సమావేశం

- హాజరుకానున్న సునీల్‌బన్సల్

నిర్మల్: భారతీయ జనతాపార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్మల్ పట్టణంలోని భైంసారోడ్డులో ఉన్న ఓ హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమయ్య తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలపై సమీక్షతోపాటు రానున్న పార్లమెంట్ ఎన్నికల సమాయత్తంపై సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి రాష్ట్ర సహ ఇన్‌చార్జి సునీల్‌బన్సల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల బాధ్యులు, నాలుగు జిల్లాల బాధ్యులు హాజరు కావాలని కోరారు.

సొసైటీలు అభివృద్ధి చెందాలి

పెంబి: రైతులకు ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంచే సొసైటీలు మరింత అభివృద్ధి చెందాలని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని మ్యాక్స్ సొసైటీకి సెంట్రల్ రూరల్ డెవలప్‌మెంట్ ద్వారా మంజురైన డిజిటల్ తేమ శాతం యంత్రాన్ని అందించారు. ఇందులో మ్యాక్స్ సొసైటీ సభ్యులు, ఏఈవో గంగాజల పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు..

సోన్: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శనివారం సోన్ మండలం కూచన్‌పెల్లి గ్రామంలో పాంకజ్ శర్మ(డీఎఫ్ఎస్) జాయింట్ సెక్రెటరీ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కల్పించారు. ఈనెల 16 డిసెంబర్ నుంచి జనవరి 26 వరకు అన్ని గ్రామాలలో ప్రాజెక్టర్ల ద్వారా పథకాలు, వాటితో కలిగే ప్రయోజనాల గురించి వివరిస్తున్నట్లు తెలిపారు. సామాజిక భద్రత, ఆయుష్మాన్ భారత్, సాధికారతపై మహిళలకు భరోసా, బ్యాంకుల ద్వారా వివిద రకాల గృహ, వ్యవసాయ రుణాలపై అవగాహన కల్పించారు. ఇంతవరకు ఈ పథకాల ద్వారా లబ్ది పొందనివారు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యుబీఐ డీజీఎం హేమంత్, ఎస్‌బీఐ ఏజీఎం శ్రీనివాసరావు, ఎల్‌డీఎం చంద్రశేఖర్, నాబార్డ్ డీపీఎం వీరభద్రుడు, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ఎంపీవో ఖలీల్‌హైమద్, ఏపీవో గంగామణి, సర్పంచ్ రాజేందర్, ఉప సర్పంచ్ సాయినాథ్ ఎంపీటీసీ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.






రిమ్స్‌లోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న కుర్చీలు, వెలుగుతున్న లైట్లు

గాడితప్పిన రిమ్స్ సమయ 'పాలన'

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రిమ్స్ వైద్య కళాశాల ఉద్యోగులు, సిబ్బంది సమయపాలన పూర్తిగా గాడి తప్పింది. రిమ్స్ జూనియర్ వైద్యులు ఆందోళన బాట పట్టడంతో సందట్లో సడేమియా అన్నట్లుగా కళాశాలలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు. శనివారం ఉదయం 10.35గంటలు దాటిన వివిధ చాంబర్లలోని కుర్చీలన్నీ ఖాళీగా ఉండడం అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. కాగా కుర్చీల్లో ఎవరు లేకపోయినా ప్యాన్లు తిరుగుతూ, లైట్లు వెలుగుతూ విద్యుత్‌ను దుబారా చేయడం వారి నిర్వాకానికి నిదర్శనం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

ట్రిపుల్‌ఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్



రామారావును అభినందిస్తున్న ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో బయోసైన్స్‌శాఖలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న శీలం రామారావుకు ఉస్మానియ విశ్వవిద్యాలయం శనివారం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఇకలాజికల్ ఇంప్లికేషన్స్ అండ్ కన్జర్వేషన్ స్ట్రాటజీస్ ఆఫ్ కొండగట్టు హిల్ ఫారెస్ట్ తెలంగాణ, ఇండియా అనే అంశంపై డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేశాడు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధన పత్రాలను ప్రచురించారు. ఈ అంశంపై శీలం రామారావుకు ఉస్మానియ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టరేట్ అందుకున్న శీలం రామారావును డైరెక్టర్ సతీశ్‌కుమార్‌తో పాటు పలువురు అధ్యాపకులు అభినందించారు.

తొమ్మిది క్వింటాళ్ల పత్తి చోరీ



తలుపు పగులగొట్టిన దృశ్యం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పట్టణ కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో తరుచు దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటి వరకు కిరాణ దుకాణాలు, వైన్స్ షాపులు, పాన్‌షాప్‌లు, రేషన్‌షాపుల్లో, ఇండ్లలో దొంగతనాలు జరిగిన ఘటనలు చూశాం. కానీ చివరకు ఆరుగాలం కష్టపడిన రైతు పండించిన పత్తిని సైతం చోరీ చేస్తున్న సంఘటనలు పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంటున్నాయి. పాత ఉట్నూర్‌కు చెందిన దూట భారతి ఇంట్లో నుంచి శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సుమారు తొమ్మిది క్వింటాళ్ల పత్తిని ఎత్తుకెళ్లారని కౌలు రైతు గురిజాల శివన్న ఆవేదన వ్యక్తం చేశాడు. నాలుగు ఎకరాలు కౌలు తీసుకుని శివన్న పత్తి పంట సాగుచేశాడు. సేకరించిన పత్తిని యజమాని భారతి ఇంట్లో ఉంచాడు. రెండో దఫా సేకరించిన అనంతరం అమ్ముకుందామనుకున్నాడు. ఈ లోగా దొంగలు పత్తిని ఎత్తుకెళ్లడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కలప పట్టివేత




వాహనంలో తరలిస్తున్న టేకు చెక్కలు

కడెం: మండలంలోని గంగాపూర్ గ్రామం నుంచి శుక్రవారం బోలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న కలపను సమాచారం మేరకు నవాబ్‌పేట్ వద్ద పట్టుకున్నట్లు ఎఫ్‌ఆర్వో అనిత పేర్కొన్నారు. పట్టుబడిన కలప విలువ సుమారు రూ.25వేలు ఉంటుందన్నారు. గంగాపూర్‌కు చెందిన గుగ్లావత్ అరుణ్‌కుమార్ బోలేరో వాహనంలో కింద భాగంలో చెక్కలు పెట్టి పై నుంచి వరిధాన్యం పోసి కడెం వైపు తరలిస్తున్నట్లు తెలిపారు.

మహిమాన్వితం...

సాయి పుణ్యక్షేత్రం

- మరో షిర్డీ మన కల్లూరు..
- నేటి నుంచి దత్త జయంతి ఉత్సవాలు



ధుని మందిరం



విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆలయం



ఆలయంలోని సాయిబాబా విగ్రహం

కుంటాల: నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయం మహిమాన్వితం.. సాయి పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. నిర్మల్ నుంచి కల్లూరు శ్రీదత్త వెంకట సాయి మందిరం 28కిలో మీటర్ల దూరంలో ఉంది. దివంగత ప్రభాకర్ మహారాజ్ భక్తుల సహకారంతో 17ఏళ్ల కిందట రూ.కోటి 25 లక్షలు వెచ్చించి షిర్డీ తరహాలో ఆలయాన్ని నిర్మించాడు. నిర్మల్ నుంచి బాసర, షిర్డీ, మహారాష్ట్ర నుంచి హైదరాబాద్, ధర్మపురి, కొండగట్టు, వేములవాడ వెళ్లే భక్తులు కల్లూరు సాయిబాబా ఆలయాన్ని ప్రత్యేకంగా దర్శించడం విశేషం.

ఆలయ విశిష్టతలు...

కల్లూరు గ్రామానికి చెందిన బుక లింబగిరి అనే భక్తుడు గుట్టపై ఉన్న మూడు పెద్ద బండరాళ్లను దత్త, వెంకట, సాయి కొలువై ఉన్నాడని పూజలు చేసేవాడు. గ్రామస్తులు ఆయన భక్తిని మెచ్చుకొని ఆలయాన్ని నిర్మించారు. భక్తుల కోరికలు నెరవేరాలని కోరుతూ దూరుడుబండ కింద నుంచి వెళ్తారు. సాయిబాబా ఆలయం పక్కనే శివనేశ్వర్, దత్తాత్రేయ, వెంకటేశ్వరస్వామి, ఆంజనేయ ఆలయాలున్నాయి. అలాగే ప్రతినిత్యం 200మంది వృద్ధులకు ఓ పూట అల్పాహారం, రెండు పూటల భోజనం పెడుతున్నారు. శివనేశ్వర్ స్వామి గురువు కోరిక మేరకు అయోధ్య మహారాజ్ కల్లూరు గుట్టపై 13ఏళ్లుగా తపస్సు కోసం ఉండిపోయారు. ఆయన ఉండేందుకు ప్రత్యేకంగా చీకటి గదిని 20అడుగుల లోతున నిర్మించుకున్నారు. 2004లో అనారోగ్యానికి గురికాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా అక్కడే కన్నుమూశారు. ఈ ఆలయంలో 1983లో సికింద్రాబాద్‌కు చెందిన ఉమామహేశ్వర్ అనే భక్తుడు తన కోరిక నెరవేరడంతో నంద దీపాన్ని వెలిగించాడు. 40ఏళ్లుగా నంద దీపం నిరంతరాయంగా జ్వలిస్తూనే ఉంది. షిర్డీ తరహాలో ఆలయ అభివృద్ధికి కృషిచేసిన దివంగత ప్రభాకర్ మహారాజ్ ఆలయాన్ని రూ.7లక్షల వ్యయంతో నిర్మించారు. వేణుగోపాల్‌చారి ఎంపీగా ఉన్న 2001లో ఆలయ అభివృద్ధికి ఎంపీ కోటా కింద రూ.10 లక్షలు మంజూరు చేసి సామాజిక భవనాన్ని నిర్మించారు. నిర్మల్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి తమ తండ్రి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం రూ.10లక్షల వ్యయంతో భవన సముదాయం నిర్మించాడు. ఆలయంలో ప్రతినిత్యం భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు.

నేటి నుంచి దత్త జయంతి ఉత్సవాలు..

మండలంలోని కల్లూరులో రెండో షిర్డీగా ప్రసిద్ధిగాంచిన సాయిబాబా ఆలయంలో ఈనెల 18 నుంచి 26 వరకు నిర్వహించే దత్త జయంతి ఉత్సవాలకు కల్లూరు దత్తగడ్ సేవా సమితి సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 18న సోమవారం ఉదయం శ్రీ విఘ్నేశ్వర పూజ, శ్రీదత్త వెంకట సాయి దేవతల పూర్ణాభిషేక పూజలు, కలశ స్థాపన, శ్రీగురు చరిత్ర సాయిబాబా సత్ చరిత్ర, ఈ నెల 24న అఖండ సాయి నామ సప్తహ, పారాయణము ప్రారంభం, శ్రీమహా సుదర్శన యాగం, శ్రీవిఘ్నేశ్వర పూజ, నవగ్రహ పూజ, 25న దత్త మహా పూజ, శ్రీ గంగాధర్ గిరి మహారాజ్ కారేగాం గారిచే జరుపబడును, 26న ఉదయం శ్రీ సుదర్శన యాగం సమాప్తి, పూర్ణాహుతి, మధ్యాహ్నం శ్రీ దత్తాత్రేయ స్వామి జననం, డోలారోహణం, ఉపనయనం, గోపాల కాల, భిక్షాటన, తీర్థ ప్రసాదములు, మహా ప్రసాదం (బండార) నిర్వహిస్తారు. రాత్రి శ్రీ దత్తాత్రేయ స్వామి పల్లకి సేవ పాలుకా దర్శనం, దత్త, వెంకట, సాయి, సతీ అనసూయ మాత చిత్రపటాలను ఊరేగింపుగా తీసుకెళ్తారు.

జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

- సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు కృషి
- ఎంపీ సోయం బాపూరావు



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్: జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం ఖేలో ఆదిలాబాద్ మొదటి సీజన్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభగల క్రీడాకారులకు కొదవ లేదన్నారు. వారికి సరైన శిక్షణ ఇస్తే ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారు. జిల్లాలోని క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా వంటి ప్రతిష్టాత్మకమైన క్రీడలను నిర్వహిస్తుందన్నారు. ఈ రకంగా జిల్లాలో సైతం ఖేలో ఆదిలాబాద్ పేరిట పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా క్రీడాకారుల సౌకర్యం నిమిత్తం జిల్లా కేంద్రంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేసేలా కేంద్ర క్రీడల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, అథ్లెటిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, పెటా సంఘం ప్రధాన కార్యదర్శి స్వామి, పోటీల ఆర్గనైజర్ విజీయస్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నిపాని వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించిన ఎన్‌క్వాస్



వైద్యసిబ్బందితో ఎన్‌క్వాస్ బృందం సభ్యులు

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలోని వెల్‌నెస్ సెంటర్‌ను ఎన్‌క్వాస్ బృందం సభ్యులు శనివారం పరిశీలించారు. ఢిల్లీకి చెందిన నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ బృందం (ఎన్‌క్వాస్) సభ్యులు ప్రదీప్ కుమార్ చౌదరి, సుప్రజాజ్యోతిరాయి వెల్‌నెస్ సెంటర్‌ను వైద్య సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆరోగ్య ఉపకేంద్రంలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, వసతులు పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వివరాలను సేకరించారు. వెల్‌నెస్ సెంటర్‌లో వైద్యసేవల రికార్డుల నిర్వహణతో పాటు జాతీయ వైద్యసేవలను అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. 14రకాల రికార్డుల నిర్వహణ, గర్భిణుల పరీక్షలు, ప్రసవాలు తదితర వాటిపై ఆరాతీశారు. పచ్చదనంతో పాటు పరిసరాలను సైతం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వివరాలను నమోదు చేసుకొని పైస్థాయి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. వారి వెంట వైద్యాధికారి స్వామి, హెల్త్ అసిస్టెంట్ నగేష్, సూపర్‌వైజర్ తులసీరాం, వైద్యాధికారి స్వామి, ఏఎన్ఎం సుజాత ఉన్నారు.

నాల్గో తరగతి ఉద్యోగుల సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ, వసతి గృహాల్లో పనిచేస్తున్న పర్మినెంట్ కుక్, కామాటి, వాచ్‌మెన్, అటెండర్స్, డేలీవేజ్, అవుట్ సోర్సింగ్ నాల్గో తరగతి ఉద్యోగుల సమావేశాన్ని ఈ నెల 18న కేబీ కాంప్లెక్స్‌లోని పీఎంఆర్‌సీ భవనంలో నిర్వహించనున్నట్లు గిరిజన సంక్షేమ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు హుస్సేన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే సమవావేశానికి ఐటీడీఏ పీవో, డీడీలు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారన్నారు. డీడీటీడబ్ల్యూ, డీటీవోలు హాజరవుతారన్నారు. ఉమ్మడి జిల్లాలోని వసతి గృహాల్లో పనిచేస్తున్న వర్కర్లందరూ హాజరు కావాలన్నారు. ఈ సమావేవంలో ఆ సంఘం నాయకులు ఎస్ శ్రీనివాస్, రాంచందర్, రాజలింగు, వసంతు, తిరుపతి, భవాని, కమలబాయి ఉన్నారు.

కౌన్సిల్ సభ్యుడికి సన్మానం



ప్రమోద్‌ను సన్మానిస్తున్న డయాగ్నోస్టిక్ సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఎన్నికల్లో కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన పట్టణానికి చెందిన ఫార్మాసిస్టు నేరేళ్ల ప్రమోద్‌ను తెలంగాణ డయాగ్నోస్టిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు టి.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఫార్మాసిస్టులకు అండగా ఉంటూ ఫార్మసీ రంగంలో లోపాలను సరిదిద్దేలా కౌన్సిల్ ద్వారా ప్రయత్నిస్తూ ముమ్ముందు మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీఏ రాష్ట్ర కార్యదర్శి నేరెళ్ల హన్మంతు, ల్యాబ్ టెక్నీషియన్స్ జ్ఞానేశ్వర్, వెంకట్రావు, ముత్యం, వెంకట్ స్వామి, అభిషేక్, రమేష్, శివ, రమణ, వకీల్ పాల్గొన్నారు.

కస్తూర్బాలో సేంద్రియ సాగు..

- కూరగాయలు పండిస్తున్న విద్యార్థినిలు



తోటలో కూరగాయలు కోస్తున్న విద్యార్థినులు

జైనథ్: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో సేంద్రియ సాగు విధానంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా ఆవు వ్యర్థాలు, వేప కషాయం వంటి సేంద్రియ ఎరువులు వాడుతూ వివిధ రకాల కూరగాయాలు పండిస్తున్నారు. దీంతో విద్యార్థులకు భోజనంలో తాజా కూరగాయలు అందడంతో పాటు సాగుపై కూడా అవగాహన పెంచడానికి అవకాశం ఉందని, పాఠశాల ప్రత్యేకాధికారిణి వీణ కుమారి తెలిపారు. ముఖ్యంగా సేంద్రియ సాగు, దానితో కలిగే లాభాలపై విద్యార్థినిలు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఉందని ఆమె చెబుతున్నారు. కూరగాయల మినీ తోటలో టమాట, వంకాయ, మిర్చీ, చిక్కుడు, ఇతర ఆకు కూరలు లభిస్తుండడంతో విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సుకు ప్రమాదం



ప్రమాదానికి గురైన స్కూల్ బస్సు

సోన్: నిర్మల్ జిల్లా సోన్ మండలం కడ్తాల్ 44వ జాతీయ రహదారిపై ప్రైవేటు పాఠశాల బస్సుకు శనివారం ప్రమాదానికి గురైంది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన బస్సు ఉదయం విద్యార్థులను తీసుకెళ్లేందుకు సోన్ మండలం మాదాపూర్, పాక్‌పట్ల గ్రామాలకు వెళ్లింది. విద్యార్థులను ఎక్కించుకుని నిర్మల్‌కు బయల్దేరింది. జాతీయ రహదారి మీదుగా కడ్తాల్ వద్దకు రాగానే లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా లారీ టైరు పేలింది. ఈ ఘటనలో టైరు స్కూల్ బస్సుకు తగలడంతో కిటికీల అద్దాలు పగిలిపోయాయి. విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే వారిని నిర్మల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆస్పత్రికి వచ్చి తమ పిల్లలను తీసుకెళ్లారు.

రాగిజావలో పడి విద్యార్థినికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉదయం విద్యార్థుల కు రాగిజాగ వండారు. అయితే పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థిని కోండ్ర ప్రజ్ఞ ప్రమాదవశాత్తు వేడి రాగిజావ గంజులో పడిపోయింది. దీంతో విద్యార్థిని శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పాఠశాల ఉపాధ్యాయులు చికిత్స నిమిత్తం నిర్మల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ తరలించారు.

నిందితులను పట్టుకోవాలని వినతి




ఎస్సైకి వినతిపత్రం అందిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

తానూరు: మండలంలోని బోల్సా గ్రామంలో గతనెల క్రితం సామాజిక వర్గానికి చెందిన గంగాధర్ అనే రైతును హత్య చేసి బావిలో పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించిన నిందితులను వెంటనే పట్టుకుని కేసు నమోదు చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులు, కుటుంబీకులు శనివారం ఎస్సై సందిప్‌కు ఫిర్యాదు చేశారు. ముదిరాజ్ సంఘం నాయకులు బోల్సా గ్రామాన్ని సందర్శించి గంగాధర్ కుటుంబీకులను పరామర్శించారు. అయితే ఇటీవల మృతుడి కొడలికి అదే గ్రామానికి చెందిన పోతన్న అనే వ్యక్తి లైంగికదాడికి ప్రయత్నించాడని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నేటి వరకు ఆయనకు అరెస్టు చేయలేదన్నారు. బాధిత కుటుంబీకులను న్యాయం జరగని ఏడాల మానవ కమిషన్‌కు ఆశ్రయిస్తామన్నారు. వినతి పత్రం అందించిన వారిలో ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి సురేందర్, శివయ్య, భూషి, శైలజ ఉన్నారు.

గంజాయి పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్ సమీపంలో శనివారం రాత్రి గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మామడిగూడ గ్రామానికి చెందిన మడావి జైవంత్‌రావ్ మామిడిగూడ గ్రామం నుంచి మహారాష్ట్రలోని కిన్వట్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో రాంపూర్ సమీపంలో వాహనాల తనిఖీలో పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 100 గ్రాముల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న దృశ్యం



కాలిన పత్తి

నేరడిగొండ: మండల కేంద్రంలోని దర్శన జిన్నింగ్ మిల్లులో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆకస్మాత్తుగా పత్తి కుప్పల్లో మంటలు చెలరేగడంతో మిల్లులో పనిచేస్తున్న సిబ్బంది అప్రమత్తమయ్యారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. అయితే రెండు రోజులుగా కొనుగోలు చేసిన పత్తి 2500 క్వింటాళ్ల వరకు ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. పత్తి ఎంతవరకు నష్టం జరిగిందన్న అంచనా మాత్రం వేయాల్సి ఉంది. ప్రమాదవశాత్తు జరిగిందా.. కావాలనే ఎవరైనా చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై సీసీఐ అధికారుల ను సంప్రదించగా పొంతనలేని సమాధానాలు చెప్పారు.

ఠాణా ఎదుట శేజల్ నిరసన

తాండూర్: స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట ఆరిజిన్ డైయిరీ సీఏవో బోడపాటి శేజల్ శనివారం నిరసన వ్యక్తం చేసింది. గతేడాది తాండూర్ పోలీసులు తనపై తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించింది. తాండూర్ మండలానికి చెందిన రంగారావు, సతీష్‌రావు, హరిప్రియ, కుమ్మరి పోషం, చిల్లర సంతోష్ తమపై తప్పుడు ఫిర్యాదు చేశారని పేర్కొంది. పోలీసులు ఏకపక్ష విచారణతో కేసుల్లో ఇరికించారని ఆరోపించింది. డెయిరీ నిర్వహణలో భాగంగా రైతులకు రూ.10 లక్షల విలువైన ఎనిమిది ఆవులు, రెండు గేదెలు ఇచ్చినట్లు తెలిపింది. తన ఫిర్యాదు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపింది. కాగా, ఈవిషయమై ఎస్సై రాజశేఖర్‌ను సంప్రదించగా.. శేజల్ ఫిర్యాదు మేరకు ఏడాది క్రితం కేసు నమోదు చేశామని, మళ్లీ అదే సమస్యపై ఫిర్యాదు చేయడానికి వచ్చారని, ఒకే అంశంపై రెండు ఫిర్యాదులు చేస్తే కేసు నమోదు చేయడం కుదరని తెలిపారు.